సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: ఓల్డ్ ముంబాయి రోడ్డు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నేషనల్ హైవే ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా చందానగర్ మెయిన్ రోడ్డు బీహెచ్‌ఈఎల్ రోడ్డు ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

నానక్‌రాంగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గచ్చిబౌలి: నానక్‌రాంగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నానక్‌రాంగూడ, సుమధుర అపార్ట్‌మెంట్స్, శ్రీరామ స్కూల్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

- ఏపీహెచ్‌బీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డీఎల్‌ఎఫ్ పరిసరాలు, డాగ్ పార్క్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని వేణుగోపాల్ తెలిపారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15-20, పచ్చిమిర్చి 40-50, బెండ 60-70, కాకర 40, దొండ 40, దోస 40, ఆలు 25-30, చామ 80, కీర 40, బీర 50, వంకాయ 30-40, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 40-50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 50-60, ఉల్లి 100 (4-5 కేజీలు), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 25-30, సొరకాయ (కేజీ) 30, అల్లం 90-100, వెల్లుల్లి 140.

సీఆర్ ఫౌండేషన్‌లో ఉచిత ఆరోగ్య కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ళ లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రం ఉంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషంట్‌కు రూ.30లు చెల్లించాలి. ప్రతి రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్షలు అందిస్తారు. వైద్య పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులు, మైనర్ ఆపరేషన్లు కూడా ఆరోగ్యం కేంద్రంలో నిర్వహిస్తారు. ఆదివారం ఆరోగ్య కేంద్రానికి సెలవు.

క్లుప్తంగా

ప్రొ.షాహిద్ నౌఖేజ్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



రాయదుర్గం: మనూ ప్రొఫెసర్ షాహిద్ నౌఖేజ్ అజ్మీకు ఇరాన్ దేశ ప్రతిష్టాత్మక సాది అంతర్జాతీయ అవార్డు లభించింది. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్‌లో ఆయన ప్రొఫెసర్. పర్షియన్ భాష, సాహిత్యానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఇరాన్ ప్రభుత్వం నుంచి ×జైజా సాదిశేని అందుకున్నారు. ప్రొఫెసర్ షాహిద్‌నౌఖేజ్ ఇప్పటివరకు 26 పుస్తకాలు రచించగా, 98 విద్యా, పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, అధికారులు అభినందించారు.

'మనూ' కల్చరల్ క్లబ్స్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్స్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ (డీఎస్‌డబ్ల్యూ), కల్చరల్ క్లబ్స్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లు, పలు రకాల కార్యకలాపాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్‌జైసీ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 18వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి



పార్కును పరిశీలిస్తున్న రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేస్తున్న పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న పలు పార్కులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు క్యూ

- 11,960 మందికి పరీక్షలు
- పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో శాశ్వత కేంద్రాలకు డిమాండ్



శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

శేరిలింగంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో 9 చోట్ల కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 11,960 మంది కంటి పరీక్షలు చేశారు. కాగా ఈ కంటి వెలుగు కేంద్రాలను పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కూడా మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

- శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో జనవరి 19వ తేదీన ప్రారంభించారు.
- సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ పరీక్ష కేంద్రాలు అందుబాటులో ఉంటాయి
- ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు పనిచేస్తాయి
- ఆధార్ కార్డు తీసుకొస్తే కంటి పరీక్షలు చేస్తారు.
- 9 కేంద్రాలలో 11,960 మందికి కంటి పరీక్షలు చేయగా, 2,850 మందికి కంటి అద్దాలు (రీడింగ్) ఇవ్వగా 1,235 మందికి కంటి సమస్యలు ఉన్న వారికి అద్దాలు అందించేందుకు ఆర్డర్ పెట్టారు. 467 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు.

కంటి వెలుగు పరీక్షా కేంద్రాల వివరాలు...

		పరీక్షలు	గ్లాసులు	గ్లాస్‌లుఇవ్వాల్సినవి
సగర సంఘం కమ్యూనిటీ హాల్, అంజయ్యనగర్‌కాలనీ		1381	157	29
కమ్యూనిటీ హాల్	కొత్తగూడ	1287	270	214
కల్చరల్ క్లబ్ హాల్	అయ్యప్ప సొసైటీ	1374	248	123
కమ్యూనిటీ హాల్	మయూరీనగర్‌కాలనీ	1290	244	95
పీజేఆర్ స్టేడియం	చందానగర్	1354	510	113
జనప్రియనగర్‌కమ్యూనిటీహల్	జనప్రియనగర్	1276	289	125
సిర్కి ఆఫీస్ ప్రాంగణం	భెల్ ఎంఐజీకాలనీ	1288	394	82
ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం-శేరిలింగంపల్లి		1376	481	289
వార్డు కార్యాలయ ప్రాంగణం---రాయదుర్గం		1354	257	165
		11,960	2,850	1,235

కంటి పరీక్షలు చేయించుకున్నా..



ప్రభుత్వం ఏర్పాటు చేయించిన కంటి పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకున్న. సంతోషంగా ఉంది. మరోసారి చెక్ చేయించుకోవడానికి అవకాశం కల్పించాలి. మా బస్తీలో చాలా మంది చేయించుకున్నారు. అద్దాలు కూడా ఇస్తున్నారు. అవసరమైతే ఆపరేషన్ కూడా చేయిస్తరని తెలిసింది.

– లక్ష్మీ, రాజీవ్ గృహకల్ప, పాపిరెడ్డి కాలనీ

ఎంతో ఉపయోగకరం



కంటి వెలుగు కేంద్రాల ఏర్పాటు ఆనందదాయకం. ముసలివారికి ఎంతో ఉపయోగకరం. రూపాయి లేకుండా పరీక్షలు చేయడం, అవసరమైతే అద్దాలు ఇవ్వడం, మరీ అవసరమైతే ఆపరేషన్ చేయిస్తామనడం సంతోషదాయకం.

–భద్రమ్మ, గుల్‌మొహర్‌పార్కు కాలనీ

పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో శాశ్వతంగా ఏర్పాటు చేయాలి



పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో కంటి పరీక్ష కేంద్రాలను కొనసాగించాలి. పేద, మధ్యతరగతి వారికి ఎంతో మేలు చేకూరుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– బాలయ్య, గోపీనగర్

20న ఆర్‌కెవై ఫౌండేషన్ క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను విడుదల చేసిన రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: మారబోయిన రాజ్‌కుమార్ జ్ఞాపకార్థం సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మసీద్‌బండలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 20న టోర్నమెంట్ ప్రారంభమవుతుందని, ఆసక్తి గల క్రీడాకారులు ఆర్‌కేవై ఫౌండేషన్ ఆఫీస్ 9989890000, ఆర్‌కేవై టీం గౌరవ అధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్ 9866622349 ఫోన్ నంబర్‌లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, చిన్నారెడ్డి, రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, అనిల్ కుమార్ యాదవ్, రాజు శెట్టి, అరుణ్ కుమార్, శ్రీకాంత్ యాదవ్, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక పన్నులు చెల్లిస్తున్నా.. అభివృద్ధి సున్నా



భాగ్యనగర్ కాలనీలోని తబలా రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యోగానంద్ తదితరులు

బీజేపీ నాయకులు గజ్జెల యోగానంద్

భాగ్యనగర్‌కాలనీ: ప్రభుత్వానికి అత్యధిక పన్నులు చెల్లిస్తున్నా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి సున్నా అని, అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని ఆ నియోజకవర్గ బీజేపీ నాయకులు గజ్జెల యోగానంద్ అన్నారు. బుధవారం భాగ్యనగర్ కాలనీలోని తబలా రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 15 రోజుల పాటు నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్‌లో సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్ర చేశామన్నారు. ఈ పాదయాత్రలో ప్రజలు అనేక సమస్యలను వివరించారని ,ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, దోమల వృద్ధి, మంచినీటి సమస్య, పారిశుధ్య సమస్యల నడుమ జీవనం కొనసాగించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం అతి పెద్దది. ఇక్కడి నుంచే ప్రభుత్వానికి పన్నులు ఎక్కువ చెల్లిస్తున్నప్పటికి ఇక్కడి సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవటంలేదని ఆయన ఆరోపించారు. రోడ్ల నిర్మాణం, ఉచిత విద్య, మౌలిక వసతులు అరకొరగా ఉన్నాయన్నారు. మరో వైపు ప్రభుత్వ భూములు, చెరువులను మింగేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజిత్‌వర్మ, నరేందర్‌రెడ్డి, కేశవరావు, రామరాజు, కమలాకర్, రవీందర్‌రావు, స్రవంతి, రాంరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు సహకరించాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మహాశివరాత్రి సందర్భంగా బీరంగూడ శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించే జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. జాతర ఏర్పాట్లపై బుధవారం ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆలయ అధికారుల, ప్రజాప్రతినిధులు నిబద్ధతతో పనిచేయాలని, 16వ తేదీ లోపు అన్ని పనులు పూర్తి చేసి, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీస్‌లను నడపాలని, స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లు, చలువ పందిళ్లు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 24 గంటల పాటు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. గతేడాది ఐదు లక్షల మంది భక్తులు జాతర హాజరయ్యారని, ఈసారి భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున తగినట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ తులసిరెడ్డి, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప, ఆలయ ఈఓ శశిధర్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, టీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పాదయాత్ర

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని పిఎస్‌నగర్, వీడియో కాలనీ, ఎఫ్‌సిఏ కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై బుధవారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

పటాన్‌చెరు టౌన్: గ్రామీణ, గిరిజన విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు వైజ్ఞానిక ప్రదర్శన, క్విజ్ పోటీలను రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించనుంది. క్రిస్టలోగ్రఫీ సొసైటీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలం, పడమట నరసాపురంలో ఈనెల 10వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూలూరుపాడు మండలం , చుట్టుపక్కల గిరిజన విద్యార్థులకు ప్రముఖ పరిశోధకులు, ఆచార్యులతో సైన్స్ ప్రాముఖ్యతను వివరించడం, సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం, క్విజ్ పోటీలు, నమూనాల ప్రదర్శన వంటివి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పోటీల విజేతలకు నగదు పురస్కారాలతో పాటు ప్రశంసపత్రాలను అందజేయనున్నారు.

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి మైత్రీనగర్‌లోని అలివేలు మంగా పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు చతుస్థానార్చనలు, నిత్యహోమం, పూర్ణాహుతి, బలిహరణం, 10 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం , రాజ భోగనివేదన, తీర్థప్రసాదగోష్టి, సాయంత్రం 6 గంటలకు చతుస్థానార్చనలు, నిత్యహోమం, పూర్ణాహుతి, బలిహరణం, 7 గంటల వరకు శ్రీవారి శేషవాహన సేవ, శ్రీవార్ల రాయబార మహోత్సవం నిర్వహించారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వినోద్‌కుమార్‌కు వినతి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలంగాణ, అత్యంత వెనుకబడిన జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు జేఎన్‌యూ, పాండిచ్చేరి యూనివర్సిటీ తరహాలో ప్రత్యేక రిజర్వేషన్లు కేటాయించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అరుణ్ కేతన్ వినోద్‌కుమార్‌ను కలిసి మాట్లాడారు. హెచ్‌సీయూ శాటిలైట్ క్యాంపస్‌ను ఉత్తర తెలంగాణలోని కరీంనగర్‌లో ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

హెచ్‌సీయూలో ఎస్‌ఎఫ్‌ఐ నిరసన

రాయదుర్గం: హెచ్‌సీయూలో లేడీస్ హాస్టళ్ల పట్ల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు రీతప్రియ, ఆసిక, సుభాషిణి, నవమి, గాయత్రి, గౌరీ నాయకత్వం వహించగా పలువురు మహిళా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం హాస్టళ్లను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



హఫీజ్‌పేట్ : సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం తెల్లవారుజామున ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీలలో కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు రోడ్లు, మంచినీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. అభివృద్ధి పనులో నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ఖాసీం, లియకాత్, సలీం తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న అదనపు డీజీపీ స్వాతి లక్రా

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో పలు అభివృద్ధి పనులను తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ విభాగం అదనపు డీజీపీ స్వాతి లక్రా ప్రారంభించారు. బుధవారం కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బెటాలియన్ ప్రాంగణంలో ప్రత్యేక మెగా హెల్త్ క్యాంప్‌ను, పరేడ్ గ్రౌండ్ డయాస్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో 8వ బెటాలియన్ కమాండెంట్ పి మురళీకృష్ణ, అదనపు కమాండెంట్ టిఎస్ సింగ్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కేంబ్రిడ్జి' ఆధ్వర్యంలో ఉచిత ఉపాధ్యాయ శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ అంతర్జాతీయ విద్యా సంస్థ కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్ అండ్ అస్సెస్‌మెంట్ ఆధ్వర్యంలో నగరంలో ఉచిత ఉపాధ్యాయ శిక్షణ వర్క్‌షాప్స్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నగరంలో నిర్వహించిన సమావేశంలో సంస్థ కంట్రీ హెడ్ టి.కె.అరుణాచలం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరవ్యాప్తంగా కేంబ్రిడ్జి లెర్నింగ్ పార్ట్‌నర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే విదేశీ విద్యాభ్యాసం కోసం నిర్వహించే ఐఇఎల్‌టీఎస్ అర్హత పరీక్షలకు హాజరయ్యే వారికి ఉపయుక్తంగా ఉండేలా సామూహిక చర్చలు, సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన పలువురు విద్యార్థులకు డిజిటల్ విద్యకు సంబంధించిన ఉత్పత్తులను ఆయన అందజేశారు.

నో కోడ్ టెక్నాలజీపై ప్యానెల్ డిస్కషన్

గచ్చిబౌలి: నాస్కామ్ ఆధ్వర్యంలో బుధవారం కోడ్ అండ్ నో కోడ్ టెక్నాలజీ ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రజాస్వామ్యీకరణపై ప్యానెల్ డిస్కషన్‌ను గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా క్విక్సీ కస్టమర్ సక్సెస్ హెడ్ గురుప్రసాద్ పమ్మి మాట్లాడుతూ క్విక్సీ వినియోగదారుల నుంచి పెరుగుతున్న నమ్మకాన్ని నమోదు చేశామని, వారు సాధారణ వినియోగ కేసుల కోసం నో కోడ్‌ని అమలు చేయడం నుంచి మరింత సంక్లిష్టమైన, సమగ్రమైన ఫంక్షన్‌ల వరకు అభివృద్ధి చెందారన్నారు. క్విక్సీ 15కి పైగా పరిశ్రమలతో పని చేస్తుందన్నారు. ఏఆర్‌టీఈఏఎస్‌ఎస్ సహ వ్యవస్థాపకుడు, సీటీఓ సిద్ధార్థ మొహంతి, యాంప్లెలాజిక్ వ్యవస్థాపకుడు సీఈఓ మన్నె.వి.చౌదరిలు క్రియాశీల భాగస్వామ్యంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

మియాపూర్‌లో చైన్‌స్నాచింగ్

మియాపూర్ : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి బంగారు చైన్ తస్కరించిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... మియాపూర్‌లోని కృషినగర్‌కు చెందిన జ్యోతి తన కూతురును దగ్గర్లో ఉన్న చెర్రీస్ ప్లే స్కూల్ నుండి బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటికి తీసుకు వెళ్తుండగా కృషినగర్‌లో ముందు నుండి ఇద్దరు వ్యక్తులు పల్సర్ ద్విచక్రవాహనంపై నుంచి వచ్చి మెడలో ఉన్న నాలుగు తులాల మంగళసూత్రం లాక్కుని పారిపోయారు. దీంతో జ్యోతి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మియాపూర్ పోలీసులు కృషినగర్‌లో సీసీ కెమెరాలు పరిశీలించగా పల్సర్ బైక్ పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించారు. నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

మహాశివరాత్రికి స్పెషల్ బస్సులు

- 17 నుంచి 21వ తేదీ వరకు ఏడుపాయలకు ప్రత్యేక బస్సులు
- మహాశివరాత్రి రోజు 24 గంటలపాటు బస్సులు

రాయదుర్గం: మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక బస్సులను నడిపేందుకు గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏడుపాయల జాతర, మహాశివరాత్రికి భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

- పటాన్‌చెరు బస్టాండ్ నుంచి ఏడుపాయలకు ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి.
- మహాశివరాత్రి రోజు 24 గంటలపాటు ఆర్టీసీ బస్సులను ఏడుపాయలకు నడపాలని నిర్ణయించినట్లు హెచ్‌సీయూ డిపో అధికారులు తెలిపారు.
- పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రారంభమై దౌల్తాబాద్, హత్నూర మీదుగా ఏడుపాయలకు 20 బస్సులను ప్రత్యేకంగా నడపాలని నిర్ణయించారు.
- అలాగే పటాన్‌చెరు బస్టాండ్ నుంచి బీరంగూడ వరకు ప్రత్యేకంగా 15 బస్సులుంటాయని, రద్దీ పెరిగితే వెంటనే మరిన్ని బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేశామని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ పి శ్రీనివాస్ తెలిపారు.

అవగాహన లేకుండా విమర్శలు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్: రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ నాయకుడు కాటా శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ పటాన్‌చెరు నాయకులు విమర్శించారు. బుధవారం పటాన్‌చెరు మండల అధ్యక్షుడు పాండు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. భానూరు పంచాయతీ పరిధిలోని పశువైద్యశాలకు సంబంధించిన ప్రహరీని ఇటీవల సర్పంచ్, కొందరు వార్డు సభ్యులు ధ్వంసం చేసి వ్యాపార సముదాయం నిర్మించడంతో సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. విచారణ అనంతరం పనులు నిలిపివేశారని, అయితే దీనిపై కాంగ్రెస్ నాయకుడు కాట శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారంటూ అవగాహన లేకుండా విమర్శలు చేయడం తగదన్నారు.

యూజీడీ పైపులైన్ పనుల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. వసంత్‌నగర్ కాలనీలో జరుగుతున్న యూజీడీ పైపులైన్ పనులను పరిశీలించారు. అదే విధంగా 6వ ఫేజులో నూతనంగా నిర్మిస్తున్న ఫుట్‌పాత్‌ను, 9వ ఫేజులోని మహిళా మండలి పార్కులోని ఓపెన్ జిమ్ పరికరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఖాళీ స్థలాల్లో ప్రజలకు ఉపయోగపడే క్రీడా మైదానాలు, పార్కులు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సెమీస్‌లో టీమ్ ఆల్ఫా, టీమ్ మైసా



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ సెమీఫైనల్ స్టేజ్‌కు చేరింది. హోరాహోరీగా సాగుతున్న మూడో సీజన్‌లో టీమ్ ఆల్ఫా, టీమ్ మైసాతో పాటు మీనాక్షి మావెరిక్స్, స్వాన్స్ జట్లు సెమీఫైనల్లో అడుగుపెట్టాయి. ఊహించినట్టుగానే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. గ్రూప్ ఎలో టీమ్ ఆల్ఫా సామా ఏంజెల్స్‌పై విజయం సాధించింది. గ్రూప్ బిలో మీనాక్షి మావెరిక్స్ 7-1 స్కోర్‌తో ఎంవైకే స్ట్రైకర్స్ పైనా, గ్రూప్ సీలో డిఫెండింగ్ ఛాంపియన్ స్వాన్స్ జట్టు 5-3 స్కోర్‌తో స్వింగ్ కింగ్స్‌పైనా గెలుపొందాయి. ఇక గ్రూప్ డిలో టీమ్ మైసా 4.5-3.5 స్కోర్ తేడాతో లాహిరి లయన్స్‌పై విజయం సాధించింది. టీమ్ మైసా జట్టు ఒక పాయింట్ తేడాతో సెమీస్ బెర్త్ దక్కించుకుంది. ఫిబ్రవరి 12న వూటీ గోల్ఫ్ కౌంటీలో సెమీఫైనల్స్ జరగనుండగా.. ఈ సీజన్ ఫైనల్ పోటీలు థాయ్‌లాండ్‌లోని రాయల్ జెమ్స్ ఎరెనా గోల్ఫ్ కోర్స్ ఆతిథ్యమివ్వనుంది.